క్లుప్తంగా

జేనాయుడుపాలెం కేజీబీవీలో బోధన, వసతికి ఏర్పాట్లు



జె.నాయుడుపాలెంలో ప్రారంభమైన కేజీబీవీ వసతి గృహ భవనం

రోలుగుంట : జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయిన వెంటనే ఈ నెలాఖరులోగా జేనాయుడుపాలెం కేజీబీవీలో వసతి, బోధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఇక్కడ 9, 10 తరగతులు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల ప్రవేశాల కోసం పలు గ్రామాలకు చెందిన 55 మంది విద్యార్థినుల నుంచి దరఖాస్తులు అందాయన్నారు. అలాగే ఇక్కడ భర్తీ చేయాల్సి కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్‌మన్ పోస్టుల కోసం 50 మంది దరఖాస్తు చేసుకున్నారున్నారు. వీటిని జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అందజేస్తామని వివరించారు.

నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి భార్య లక్ష్మికి నగదును అందిస్తున్న సభ్యులు

కె.కోటపాడు : చౌడువాడకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు ధనిమిశెట్టి అప్పన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో పేదరికంలో ఉన్న భవణ నిర్మాణ కార్మికుడి కుటుంబానికి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి నరసింహస్వామి భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు ఆర్థికంగా అండగా నిలిచారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వారా రూ.10వేలు, ధనిమిశెట్టి వారి కుటుంబాల తరుపున మరో రూ.20వేల నగదును బుధవారం మృతుడి భార్య లక్ష్మికి అందించారు. మృతుడికి గల ఇద్దరు ఆడపిల్లల చదువులకు అండగా భవన నిర్మాణ కార్మిక సంఘం ద్వారా అండగా ఉండనున్నట్టు ధనిమిశెట్టి మాలిబాబు, బుజ్జి, కళ్యాణం, శ్రీను, పైడిబాబు, కొండబాబు పేర్కొన్నారు.

కేజేపురంలో సమస్యలపై వినతిపత్రం

మాడుగుల రూరల్ : మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతి పత్రం అందించామని, స్థానిక ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు బుధవారం పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా, గ్రామానికి మంగళవారం వచ్చిన బండారుకు గ్రామంలో అంసంపూర్తిగా నిలిచ్చిపోయిన కల్యాణ మండపం నిర్మాణం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, పంట పొలాల్లో కోతులు బెడద ఎక్కువగా ఉందని, పంట పొలాలు నాశనం చేస్తున్నాయని, కె.జె.పురంలో పీహెచ్‌సీలో మందుల కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో లోవోల్టేజి సమస్య గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, కోరారు.

జెడ్పీటీసీకి మాజీ ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



జడ్పీటీసీ గిరిబాబును పరామర్శిస్తున్న గణేష్

గొలుగొండ : పది రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్న గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబును నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బుధవారం సాయంత్రం గిరిబాబు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. జ్వర తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఇబ్బంది పడినట్లు గిరిబాబు తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గణేష్ వెంట వైఎస్సార్‌సీపీ నేతలు గిరిబాబును పరామర్శించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7997958337, 7075709854, 7997958336

కష్టాల్లో ఖరీఫ్ సాగు

- నాడు నీటి ముంపు – నేడు తెగుళ్ల బెడద
- ధరలు పెరిగిన పురుగు మందులు
- ఆవేదనలో అన్నదాతలు



నాడు జంపెనలో నీటి ముంపునకు గురైన వరి చేలు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

మాడుగుల : రెండు నియోజకవర్గాలు, మాడుగుల, చోడవరం రైతులకు ప్రధాన ఆధారమైన గోవాడ చక్కెర కర్మాగారం చెరకు రైతులకు పేమెంట్‌లు సక్రమంగా ఇవ్వకపోవడంతో రైతులు ఈ ఏడాది వరి సాగుపై దృష్టి సారించారు. చెరకు సాగు చేసే పొలాలు సైతం వరి సాగు పెంచారు. జిల్లాలో ఈ ఏడాది 3 లక్షల ఎకరాలకు పైగా ఖరీఫ్ వరి సాగు చేయగా మాడుగుల నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల్లో సాగు చేశారు. పెట్టుబడులు పెట్టి వరి నాట్లు వేసిన 15 రోజులకే తుపాను రావడంతో అప్పట్లో కొంత మేర వరి చేలు నీట ముంపునకు గురయ్యాయి. రైతులు మరలా పోయిన వరి నాట్లు స్థానంలో కొత్తగా మొనలు వేసుకున్నారు. వరి చేలు ఏపుగా ఎదుగుతున్నాయనుకునే సరికి దోమ, పచ్చ తెగుళ్లు తీవ్రంగా ఆశిస్తున్నాయి. 10 రోజులకొకసారి ఎకరాకు సుమారు రూ.1200 ఖర్చు పెట్టి మందులు పిచికారీ చేస్తున్నా సరే తెగుళ్లు తగ్గడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా చేతికి అందడంతో పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడేవారుకాదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఇంకా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహాయం అందలేదని, ఖరీఫ్ వరి సాగు కూడా ఆశించిన స్థాయిలో లేదని, రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

ప్రభుత్వ సహాయం అందలేదు



ప్రభుత్వం రైతు భరోసా అందజేయలేదు.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి ఖరీఫ్ వరి సాగు చేశాం, వరి మొనలు వేసిన వెంటనే నీట ముంపునకు గురవడంతో కొంత నష్టపోయాం. ప్రస్తుతం వరి చేలుకు ఎన్నడూ లేని విధంగా తెగుళ్లఆశిస్తున్నాయి. ఎకరాలకు రూ.1200 చొప్పున 10 రోజులకు ఒకసారి పురుగుమందులు పిచికారీ చేస్తున్నా తెగుళ్ల అదుపులోకి రాలేదు. ఈ ఏడాది వరి చేలకు దిగుబడులు వచ్చే పరిస్థితులు కనిపించలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. –సలాది అప్పునాయుడు, రైతు, గాదిరాయి

విద్యతోపాటు, ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్



మేళాకు హాజరైన నిరుద్యోగులు

చోడవరం రూరల్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అత్యున్నత విద్యా బోధనతో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పించడానికి జాబ్ మేళాల నిర్వహణకు ప్రాధాన్యమిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, స్కిల్ హబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇది రెండో జాబ్ మేళా అని తెలిపారు. గత మేళాలో 94 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కినట్టు చెప్పారు. కళాశాలలోని స్కిల్ హబ్ ద్వారా విద్యార్థులు తమలో దాగిన స్కిల్‌ను వెలికి తీయాలని, తద్వారా తాము ఆశించిన రంగంలో ఉద్యోగ సాధన సుసాధ్యమని జిల్లా కో–ఆర్డినేటర్ వి.అప్పలనాయుడు అన్నారు. కాగా బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళాలో అపోలో ఫార్మశీకి 20 మంది, 2050 హెల్త్‌కేర్‌కు 19 మంది, వరుణ్ బజాజ్‌కు నలుగురు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హెచ్చార్ సి.నాగార్జున, కిషోర్, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రితీష్, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, వి.రత్నభారతి, సీనియర్ ఉపన్యాసకులు హెచ్.సుధీర్, సూర్యవతి, ఐవివి సత్యవతి, ఇన్‌స్ట్రక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన అప్పన్నపాలెంలో పండగలా ఆలయ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట : మండలంలో గల చిన అప్పనపాలెం గ్రామ దేవత పైడిమాంబ ఆలయ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని గ్రామస్తులు వేడుకగా నిర్వహించారు. పార్టీలకు అతీతంగా గ్రామ శివారులో దాతల విరాళాల సహాయం సుమారు రూ.50 లక్షలతో కొత్తగా పైడిమాంబ ఆలయం నిర్మించారు. మూడు రోజులుగా అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారి విగ్రహం, ద్వారపాలక శిలా మూర్తుల విగ్రహాలను ప్రతిష్టించారు. అమ్మవారి శిఖర యంత్ర విగ్రహ ఆవిష్కరణ ప్రతిష్ఠ మహోత్సవం, హోమాలు, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పది వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి ఆలయంలో ప్రత్యేక భక్తి భజనలు, సంకీర్తనలు ఏర్పాటు చేశారు. పలు పార్టీల నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్వాసితులకు హామీలు నెరవేర్చాలి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న యర్రాపాత్రుడు, భూనిర్వాసితులు

నర్సీపట్నం : మాకవరపాలెం పయనీర్ కంపెనీ యాజమాన్యం భూనిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భూ నిర్వాసితులు, చేతివృత్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ నిర్వాసితులతో కలిసి యర్రాపాత్రుడు ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు బుధవారం వినతి పత్రం అందజేశారు. భూసేకరణ చేసిన సమయం నుంచి నేటి వరకు జరిగిన ఆరాచకాలపై బహిరంగ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూసేకరణ సమయంలో ప్రతి ఇంటికి కంపెనీలో ఉద్యోగం, రెండు సెంట్ల భూమి, ఉపాధి నిమిత్తం పాడి పశువులు, ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు ఇస్తామని కంపెనీ వారు రైతులకు హామీ ఇచ్చారన్నారు. నిర్వాసితులు, పునరావాసులకు ఇంత వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా తాటి ఆకు ఇళ్లలో ఉన్న మాకిరెడ్డి వరహాలమ్మ ఇంటిపై కంపెనీ సిబ్బందితో దాడి చేయించారని ఆరోపించారు. దాడిపై పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని, తిరిగి బాధితులపైనే కేసులు బనాయిస్తున్నారని అన్నారు. భూ నిర్వాసితుల అవసరాల మేరకు ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ భూమిని అనర్హులైన బినామీ పేర్లతో అక్రమ పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకున్నారన్నారు. రైతులకు నష్ట పరిహారాలు, ప్యాకేజీలు రాకుండా అరాచకాలకు పాల్పడిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏవోను కలిసిన వారిలో ఎం.అప్పలనాయుడు, సిహెచ్.రాజుబాబు, మాకిరెడ్డి నూకరాజు, ఎస్.లోవరాజు, ఎం.సత్తిబాబు ఉన్నారు.

పలు గ్రామాల్లో జోరుగా వర్షం



గొలుగొండలో వర్షం కురుస్తున్న వర్షం

గొలుగొండ: మండలంలో చిన్నయ్యపాలెం, జోగుంపేట, అమ్మపేట, పాతమల్లంపేట, జానికిరాంపురం, గొలుగొండ గ్రామాల్లో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. దీని కారణంగా వరి పంటలతో పాటు మెరక పంటలైన సరుగుడు, చెరకు, టమాటాతో పాటు కూరగాయల సాగుకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు. గంట పాటు కురిసిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

రహదారుల మరమ్మతులకు నిధులు



మరమ్మతులు చేపట్టనున్న చింతపల్లి రోడ్డు

నర్సీపట్నం: రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో రహదారుల రూపురేఖలు మారనున్నాయి. మున్సిపాలిటీ, నర్సీపట్నం మండలంలో రహదారులకు రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక మరమ్మతుల కింద రూ.1.65 కోట్లు మంజూరు చేసింది. రహదారుల మరమ్మతుల పనులు ఈ నెలాఖరులోపు వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. గుంతలు పూడ్చడంతో పాటు దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్త కల్వర్టులు నిర్మించనున్నారు. విశాఖ–తాళ్లపాలెం రోడ్డుకు రూ.18 లక్షలు, నర్సీపట్నం–కేడిపేట రోడ్డు మరమ్మతులతో పాటు రెండు కల్వర్టుల నిర్మాణానికి రూ.55 లక్షలు, బీసీ కాలనీ రూ.2 లక్షలు, వేములపూడిలో రూ.2 లక్షలు, జోగునాధునిపాలెం రోడ్డు రూ.లక్ష, చింతపల్లి రోడ్డు రూ.4 లక్షలు, లారీయార్డు నుంచి బయపురెడ్డిపాలెం బ్రిడ్జి రోడ్డు రూ.10 లక్షలు, పెదబొడ్డేపల్లి రోడ్డు రూ.10 లక్షలు, పట్టణంలో మెయిన్ రోడ్డు రూ.10 లక్షలు కేటాయించారు. నెలాఖరులోపు పనులు పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించామని అర్అండ్‌బీ ఏఈ నారాయణరెడ్డి తెలిపారు.

నేడు గాదిరాయిలో పశు వైద్యశిబిరం

మాడుగుల : గాదిరాయి గ్రామంలో గురువారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం జరగనుందని, ఏడీ వి. చిట్టినాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. చుట్టపక్కల గ్రామాలు జంపెన, సత్యవరం, ఎం.కృష్ణాపురం, వీరనారాయణంకు చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎదకురాని పశువులకు, గర్భకోశ వ్యాధులకు, ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని ఏడీ తెలిపారు.

డిస్‌లెక్సియాపై అవగాహన పెరగాలి

- జన్యుపరమైన కారణాలతో పిల్లల్లో అభ్యసన వైకల్యం
- ప్రత్యేక విద్య ద్వారా అధిగమించే అవకాశం
- గోవాడలో అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఆరోగ్య, ఉపాధ్యాయ, విద్యార్థులు

చోడవరం రూరల్ : స్పెసిఫిక్ లెర్నింగ్ డిజాస్టర్‌లో భాగంగా 80 శాతం మంది పిల్లలు డిస్ లెక్సియా (అభ్యసనా వైకల్యం) బాధితులుగా ఉన్నారని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాము అన్నారు. బుధవారం పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ఈ అంశంపట్ల అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్న ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జన్యుపరమైన కారణాలతో ఏర్పడిన నాడీ సంబంధ వైవిధ్యతే డిస్ లెక్సియా అని అన్నారు. ఈ రుగ్మత ఉన్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని అయితే అందుకు తగిన సామాజిక మద్దతు, విద్యాపరమైన సర్దుబాట్లు చేయాల్సి ఉంటుందని చెప్పారు. వీరి ఐక్యూ సగటు కన్నా అధికంగా ఉంటుందన్నారు. రాయడంలో సమస్యలు ఉన్నట్టయితే డిస్ లెక్సియా అని, చదివే విషయంలో సమస్యలు ఉంటే డిస్ గ్రాఫియా అని, గణిత సమస్యలుంటే డిస్ కేలుక్యా అని, శరీరంలో వివిధ భాగాల్లో సమన్వయం లోపిస్తే డిస్ ప్రేసియా అని అంటారని ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు వరప్రసాద్ వివరించారు. వీరిని ఎనిమిదేళ్ల వయసు వచ్చేనాటికి గుర్తించి, వారు విద్యాపరమైన విషయాల్లో సర్దుబాటు చేసుకోవడానికి వీలుగా విస్తృతమైన సహకారం అందించాలని సూచించారు. పిల్లల్లో ఈ రుగ్మత పట్ల సమాజంలో సరైన అవగాహన పెరగాలని అన్నారు కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు సన్నిబాబు, నరసింగరావు, చోడవరం భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సస్య రక్షణకు సూచనలు పాటించాలి



రోలుగుంటలో తెగుళ్లు సోకిన పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట: పంటలకు సోకిన తెగుళ్ల నివరాణ కోసం సస్యరక్షణ కోసం వ్యవసాయాధికారుల సూచనలు తీసుకొని పాటించాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. రోలుగుంట, కొవ్వూరు, కంచుగుమల తదితర గ్రామాలను ఆమె బుధవారం రైతులతో కలసి వారి పొలాలను సందర్శించి పంటలను ఆశించిన తెగుళ్లను పరిశీలించారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పచ్చపురుగు, పాచితెగుల సమస్య ఉందని, అలాగే పొడతెగులు, సుడిదోమ కూడా ఆశించే అవకాశం ఉందని, ప్రాథమికంగా గట్లపై ఎదిగి ఉన్న గడ్డిని త్వరితగతిన కోసి పంటకు గాలి వేసే విధంగా బాటలు కూడా వేసుకోవడం మంచిదన్నారు.

తెగుళ్లు తగ్గాకే నత్రజని ఎరువులు వాడాలి

మాడుగుల : మండలంలో ఎల్.పొన్నవోలు, జాలంపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు వరి చేలు పరిశీలించారు. వరి పొలాలకు పాము పొడ, అగ్గితెగు ళ్లు ఆశించాయని, తెగుళ్లు తగ్గిన తర్వాత మాత్రమే నత్రజని ఎరువులు వాడాలని రైతులకు సూచించారు.

కె.కోటపాడు : గుల్లేపల్లి, కె.కోటపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో ఆకుముడత తెగులు నివారణకు క్లోరిపైరిపాస్‌ను 2ఎం.ఎల్‌ను ఒక లీటర్ నీటిలో వేసి పిచికారి చేయాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

చీడికాడ: చెట్టుపల్లి, వెల్లంకి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎం.రమాదేవి వరి పంటలో పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

దేవరాపల్లి: మామిడిపల్లి, వేచలం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, శాస్త్రవేత్త కిశోర్‌కుమార్ వరి పొలాలను సందర్శించి ఆకుముడత, సుడి దోమ తెగుళ్ల నివారణకు సూచనలు చేశారు.

గొలుగొండ : వరి పంటను ఆశించే చీడపీడల నివారణకు రైతులు సూచనలు పాటించాలని ఏవో సుధారాణి తెలిపారు. గాదంపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభల నిర్వహణ

- 15 రోజుల్లోగా సమస్యల పరిష్కారం

కె.కోటపాడు : మండలంలో 27 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే గ్రామ సభలను నవంబర్ 27 వరకూ జరపనున్నట్టు తహసీల్దార్ భాగ్యవతి విలేకరులకు తెలిపారు. ఈ గ్రామసభల్లో రెవెన్యూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపనున్నట్టు తెలిపారు. రైతులు తమ భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు, భూస్వభావం తదితర అంశాలు పట్టాదార్ పాస్ పుస్తకాలలో తప్పుగా నమోదు అయితే ఆయా గ్రామసభల్లో అర్జీలు పెట్టుకోవాలని ఆమె కోరారు. అర్జీని అందించిన 15 రోజుల్లోగా సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు.

భూరికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకోండి

బుచ్చెయ్యపేట : రైతుల భూ సమస్యల పరిష్కారానికి గురువారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.లక్ష్మి విలేకరులకు తెలిపారు. 17న కరక, 18న చినమదీన, 19న భట్లోవ, 21న చింతపాక,పీపీ అగ్రహారం, 22న ఐయితంపూడి, 23న కొండపాలెం,24న కేపీ అగ్రహారం, 25న పొట్టిదొరపాలెం 26న పెదమదీన, 28న పెదపూడి, ఫంగిడి, 29న ఆర్.శివరాంపురం, ఆర్ భీమవరం, 30న అప్పంపాలెం, నవంబర్ 1న తైపురం, 2న చిన అప్పనపాలెం, దిబ్బిడి, 4న మంగళాపురం, 5న గంటికొర్లాం, 6న చిట్టియ్యపాలెం, 7న తురకలపూడి, 8న నీలకంఠాపురం,రాజాం, 11న పోలేపల్లి, 12న ఎంబి పాలెం, మల్లాం, 13న కొమళ్లపూడి,14న కొండెంపూడి,15న ఎల్.శింగవరం,16న ఎల్‌బీ పురం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

మాడుగుల రూరల్: భూసర్వే జరిగిన గ్రామ పంచాయతీల్లో అభ్యంతరాల స్వీకరణకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు కె.రమాదేవి విలేకరులకు తెలిపారు. ఈ నెల 17న భాగవతుల అగ్రహారం, 18న జి.అగ్రహారం, 19న గాదిరాయి, 21న గొప్పులపాలెం, 22న లక్ష్మీపురం, 23న వంటర్లపాలెం, 24న జంపెన, 25న పెదసారాడ, 26న వీరనారాయణం, 28న లోవకొత్తపల్లి, 29న కాగిత, 30న ఎం.కృష్ణాపురం, నవంబర్ 4న ఎం.కె.వల్లాపురం, 5న కింతలి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సులు జరుగుతా యన్నారు. నవంబర్ 6న సంగ్యాం గ్రామానికి సంబంధించి అవురువాడ సచివాలయం వద్ద, 7న చినకూర్మం, 8న పెద గొర్రిగెడ్డ అంగన్‌వాడీ భవనం వద్ద, 11న లోవకృష్ణాపురంనకు సంబంధించి ఎల్.గదబవీధి కమ్యూనిటీ హాలు వద్ద, 12న వి.జె.పురం, 13న వి.వి.అగ్రహారం, 14న జె.డి.పేట, 15న అనుకూరుకు సంబంధించి తుమ్మవానిపాలెం గుడి వద్ద, 16న సత్యవరం, 18న పొంగలిపాక, 19న పప్పుశెట్టిశేరికి సంబంధించి, కె.జె.పురం రామాలయం వద్ద, 20న ఎం.కోటపాడు, 21న ఎం.కోడూరు, 22న చినసారాడ, 23 న పి.శివరామ్‌పురం, 24న కూర్మానాధపురం, 25న ఎరుకువాడ, 26న ఒమ్మలి, 27న అవురువాడలో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దార్ తెలిపారు.

మాకవరపాలెం : భూ సమస్యలపై గురువారం నుంచి జరిగే గ్రామ సభల్లో రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామారావు తెలిపారు. రీసర్వేలో దొర్లిన తప్పులను సరి చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 17 నుంచి వచ్చేనెల 1 వరకు గ్రామ సభలు నిర్వహించాలని ఆదేశాలిచ్చిందన్నారు.

దేవరాపల్లి : భూములు రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గురువారం నుండి రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ పి.లక్ష్మీదేవి బుధవారం విలేకరులకు తెలిపారు. గురువారం తామరబ్బలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెవెన్యూ గ్రామ సభ జరుగుతుందని, స్థానిక రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం తామరబ్బ పంచాయతీ పరిధిలోని పల్లపుకోడాబు గ్రామంలో రెవెన్యూ గ్రామ జరుగుతుందని తెలిపారు.

చోడవరం: రెవిన్యూ సమస్యల పరిష్కారానికి ఈనెల 17వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామసభను నిర్వహిస్తున్నామని మండల తహసీల్దార్ ఎ.రామారావు చెప్పారు. రెవెన్యూ గ్రామసభలను ఈనెల 17 నుంచి నవంబరు 17వ తేదీ వరకూ నెలరోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు.

బదిలీ అయిన కార్యదర్శులకు వీడ్కోలు



నారాయణరాజుపేటలో జ్యోతిరాణిని సత్కరిస్తున్న సర్పంచ్, తదితరులు

మాకవరపాలెం : బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులకు ఘన వీడ్కోలు పలికారు. మండలంలోని నారాయణరాజుపేట, బయ్యవరం, జంగాలపల్లి కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోతిరాణి, శెట్టిపాలెం కార్యదర్శిగా పనిచేస్తున్న గోపీకి ఇటీవల బదిలీ అయింది. వారికి సర్పంచ్‌లు పీలా వరలక్ష్మి, అల్లు రామునాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి



కె.కోటపాడులో నట్టల నివారణ మందును వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఏడీ దినేష్‌కుమార్

కె.కోటపాడు : గొర్రెలు, మేకల పెంపకందారులు తప్పనిసరిగా ఏడాదికి మూడుసార్లు నట్టల నివారణ మందును వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేస్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా నట్టల నివారణ మందును వేసే కార్యక్రమం ఈ నెల 31 వరకూ జరగనున్నట్టు తెలిపారు. కె.కోటపాడు మండలంలో 17 వేలు, దేవరాపల్లి మండలంలో 16500 గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందు లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

చీడికాడ: మండలంలో వరాహపురం, ఖండివరం, తురువోలు గ్రామాల్లో 420 గొర్రెలు, 830 మేకలకు బుధవారం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్టు మాడుగుల ఏరియా పశువైద్య శాఖ సహాయ సంచాలకుడు తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తమ రైతు సేవా కేంద్రాల్లో గాని, పశువైద్య శాలల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

తాండవ నీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

నాతవరం : తాండవ ప్రాజెక్టు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆదేశించారు. ఆయన బుధవారం తాండవ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టరు ఆదేశాల మేరకు నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ సూచనల ప్రకారం పది రోజుల వ్యవధిలో తాండవ రిజర్వాయరు ఆయకట్టు పరిధిలో రైతుల ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు కావడంతో నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాండవ రిజర్వాయరు పరిధిలో నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, పాయకరావుపేట, తుని, కోటనందూరు, రవతలపూడి మండలాల పరిధిలో ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ సతీష్‌కుమార్, వర్కు ఇన్‌స్పెక్టరు అప్పారావు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు శిక్షణ

మాకవరపాలెం : సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో గురు, శుక్రవారాలు ఈ శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీల పాలనలో విధులు, బాధ్యతలు తదితర అంశాలపై ఈ శిక్షణ ఇస్తామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐపీలింగ్ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణ, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com